ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

5

ఆదివారం 28 జూలై 2024

# పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

● జిల్లాలో 2.64 లక్షల మందికి ప్రయోజనం

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూలై 27: రాష్ట్రప్రభుత్వం సామాజిక భద్రతలో భాగంగా ఎన్టీఆర్ భరోసా కింద అందిస్తున్న పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. ఆగస్టు 1వతేదీ నాడు లబ్ధిదారుల ఇంటి ముంగిటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేస్తోంది. గత నెల సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ఆగస్టు 1వతేదీ కూడా సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అయితే లబ్ధిదారులు ఒకటి, రెండు తేదీల్లో పింఛన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత మిగిలిన పింఛన్ల మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించే అవకాశాలు ఉన్నట్లు ఓ అధికారి వెల్లడించారు.

### రూ.112.47 కోట్ల నిధులు సిద్ధం

ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం పేదలకు ఆదరవుగా నిలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పింఛను కంటే రెట్టింపు స్థాయిలో ఈ ప్రభుత్వం పింఛన్ల పంపిణీ చేపడుతోంది. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా పింఛన్ కూడా పెరగడంతో కొంత ఊరటగా ఉందని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు. ఆగస్టు నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.112.47 కోట్ల నిధులు విడుదల చేసింది. అయితే లబ్ధిదారులు సకాలంలో పింఛను అందుకునేందుకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది.

### జిల్లాలో 2.64 లక్షల మందికి ప్రయోజనం

జిల్లాలో 2,64,014 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛను అందనుంది. ఇందులో వృద్ధాప్యపింఛన్లు 1,37,199 మంది, వితంతు పింఛన్లు 58,710 మంది, వికలత్వం పింఛన్లు 39,570 మంది, చేనేత కార్మికుల పింఛన్లు 9,487 మంది అందుకోనున్నారు. అలాగే 125 మంది గీత కార్మికులు, 484 మంది మత్స్యకార్మికులు, 3,856 మంది ఒంటరి మహిళలు, 136 మంది ట్రాన్స్‌జెండర్స్, 3,308 మంది డప్పు కళాకారులు, 108 మంది కళాకారులు, 7,201 మంది అభయ హస్తం పింఛన్లు పొందనున్నారు. వీరితో పాటు తలసేమియా, డయాలసిస్ తదితర పింఛన్లు అందుకునేవారు ఉన్నారు. ఈ మేరకు లబ్ధిదారుల జాబితాతో పాటు పింఛన్లకు సంబంధించిన మొత్తాన్ని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ల ఖాతాల్లో జమ చేసేందుకు డీఆర్‌డీఏ అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

# గంజాయిని అరికడతాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



● గంజాయి రవాణా, అమ్మకం, కొనేవారిపై ప్రత్యేక దృష్టి

● 20 మందితో ఎన్‌ఫోర్స్‌మెంటు ఏర్పాటు

● రౌడీయిజం చేసినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు

● భూకబ్జాదారులపై కఠినంగా వ్యవహరిస్తాం

● జనంతో మమేకమయ్యేందుకు విజిబుల్ పోలీసింగ్

● స్టేషన్ మెట్లెక్కిన బాధితులకు న్యాయం చేస్తాం

● ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు

● న్యూసెన్స్ జరిగే ఏరియాలపై ప్రత్యేక నిఘా

● ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు



(కడప-ఆంధ్రజ్యోతి): ఇప్పుడు జిల్లాలో విచ్చలవిడిగా దొరుకుతున్న సరుకు గంజాయి. ఏ ఏరియాలో అయినా కిరాణా వస్తువులు దొరకవేమో కానీ గంజాయి దొరకని ప్రాంతం లేదు. దీనిని అరికట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా కఠిన చర్యలు తీసుకుంటామని అంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయిని పూర్తిగా అరికడతామని.. భూకబ్జాలు, రౌడీగ్యాంగ్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని చట్టం ముందు అందరూ సమానమేనన్నారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లాలో శాంతిభద్రతలకు చేపట్టబోయే చర్యల గురించి ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**ప్రశ్న: విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయిని ఎలా అరికడతారు?**

**జవాబు:** రాష్ట్రప్రభుత్వం గంజాయిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇందుకోసం వంద రోజుల ప్రణాళిక తయారు చేసింది. ఒకపక్క ఎన్‌ఫోర్స్‌మెంటు దాడులు చేస్తూనే.. మరోపక్క గంజాయి వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. ఇక కడప గడపలో ఉన్న గంజాయిని ఏరివేసేందుకు 20 మందితో కూడిన ఓ ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో సీఐ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటారు. శుక్రవారం సాయంత్రం నుంచే ఈ స్పెషల్ ఫోర్స్ కార్యక్రమాలు ప్రారంభించింది. ఎక్కడ నుంచి గంజాయి రవాణా అవుతుంది, ఎవరు అమ్ముతున్నారు, ఎవరు కొనుగోలు చేస్తున్నారు అనేవాటిపై దృష్టి పెట్టి.. అటు ట్రాన్స్‌పోర్టు, ఇటు అమ్మకందారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. రైల్వే, ఆర్టీసీ బస్టాండ్లు, కొరియర్ పార్శిల్స్ ఇలా అన్నింటినీ తనిఖీ చేసి అరికడతాం. విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలు లేకుండా చేసేందుకు అవేర్‌నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తాం. విద్యాసంస్థల బయట ఉన్న చిన్నచిన్న బడ్డీకొట్టుల వారికి కౌన్సెలింగ్ ఇస్తాం. ఎలాంటి మాదక ద్రవ్యాలు జిల్లాలో అడుగు పెట్టకుండా ఉండేందుకు కఠిన చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న: కడపలో గ్యాంగ్‌ల కల్చర్..?**

**జవాబు:** గ్యాంగ్‌ల వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగినా, లేదా నష్టపోయి ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారిపై ఎన్ని కేసులు ఉన్నాయి, వారిని నడిపించేదెవరు అనే విషయాలన్నీ వెలికితీసి రౌడీషీట్ నమోదు చేస్తాం. అవసరమైతే కలెక్టరు అనుమతితో పీడీ యాక్టు కూడా నమోదు చేస్తాం.

**ప్రశ్న: ఇటీవల యువకులు న్యూసెన్స్‌కు పాల్పడుతూ ఇబ్బంది కలిగిస్తున్నారు?**

**జవాబు:** న్యూసెన్స్ జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఒక బృందం న్యూసెన్స్ ఎక్కడ జరుగుతుందో అక్కడ నిత్యం పర్యటిస్తుంటుంది. రాత్రిపూట కూడా నిర్ణీత సమయం తరువాత రోడ్లపై తిరగకూడదు. కొందరు పని బాట లేకుండా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తుంటారు. అందుకే మూడు రోజుల నుంచి కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగులో న్యూసెన్స్ జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక దళాలు (బ్లూకోల్ట్, స్పెషల్‌పార్టీ), రాత్రిపూట పెట్రోలింగ్ వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వాహనాలను తనిఖీ చేస్తాం.

**ప్రశ్న: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ గొడవలకు పాల్పడుతున్నారు?**

**జవాబు:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. ఇక్కడ బహిరంగ ప్రదేశాల్లో తాగుతూ గొడవలు పడి చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో 278 చోట్ల బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలను గుర్తించాం. మూడురోజులుగా అక్కడున్న మద్యంబాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ఆ ప్రాంతాలను శుభ్రం చేస్తున్నాం. ఇప్పటికే సుమారు 80 ప్రాంతాలను పోలీసులు క్లీన్ చేశారు. ఇలా చేయడం వల్ల ఈ ప్రదేశాన్ని పోలీసులు ఐడెంటిఫై చేస్తారనే ఉద్దేశ్యంతో తాగకుండా ఉంటారు. ఆయా ప్రదేశాలను వాకింగ్ ట్రాక్‌గానో, పార్కుగానో చేసే విధంగా చర్యలు చేపడతాం. ఈ విషయం కలెక్టరు దృష్టికి తీసుకెళ్తాం.

**ప్రశ్న: వైసీపీ హయాంలో పోలీసులు జనాలకు దూరం అయ్యారు. ఇప్పుడు మీ మార్కు పోలీసింగ్ ఏమిటి?**

**జవాబు:** ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరిచేందుకు విజిబుల్ పోలీసింగ్ అమలు చేస్తున్నాం. స్టేషన్‌లో ఉండే ప్రతి కానిస్టేబుల్ అర్ధరోజు జనాల్లో, పల్లెల్లో తిరగాలి. జనంతో మమేకం కావాలి. ఇలా చేయడం వల్ల జనాలకు పోలీసుల పట్ల నమ్మకం కలుగుతుంది. అసాంఘిక శక్తులకు సంబంధించిన సమాచారం మొత్తం పోలీసులకు తెలుస్తుంది. అందుకే విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి పెట్టాం.

**ప్రశ్న: నాయకులకు గన్‌మెన్ల తొలగింపు దుమారం రేపుతోంది?**

**జవాబు:** గన్‌మెన్లు కావాలన్నా, తొలగించాలన్నా సెక్యూరిటీ రివ్యూ కమిటీ సూచన మేరకే జరుగుతుంది. ఎవరికైనా ప్రత్యర్థుల నుంచి ముప్పు ఉంటే కమిటీ సూచన మేరకు భద్రత కల్పిస్తాం. గతంలో పలువురికి గన్‌మెన్ల సౌకర్యం కల్పించారు. అయితే ఇటీవల సెక్యూరిటీ రివ్యూ కమిటీ అవసరం లేదని తెలపడంతో కొంతమందికి పోలీసుల సంఖ్యను తగ్గించాం. ఇలా 109 మంది సిబ్బందిని వెనక్కి తీసుకున్నాం.

**ప్రశ్న: గతంలో ఇష్టారాజ్యంగా గన్ లైసెన్సులు ఇచ్చారు?**

**జవాబు:** గన్‌లైసెన్స్ అవసరం అయిన వారికి మాత్రమే ఇస్తాం. అయితే దానిని దుర్వినియోగం చేయకూడదు. లైసెన్సు పొంది వాటిని ఇష్టారాజ్యంగా ఉపయోగిస్తే లైసెన్సు రెన్యువల్ వచ్చినప్పుడు దానిపై పరిశీలిస్తాం. దీని ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న: ఎర్రచందనం, క్రికెట్ బెట్టింగ్‌ల కట్టడికి?**

**జవాబు:** ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటాం. వెహికల్స్ చెకింగ్ చేసి అరికడతాం. స్మగ్లర్లపై ఉన్న పెండింగు వారెంట్లు అన్నీ పరిశీలిస్తాం. క్రికెట్ బెట్టింగ్‌పైనా కఠినంగానే వ్యవహరిస్తాం. ఇక న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్క బాధితునికి న్యాయం చేస్తాం. చట్టం ముందు అందరూ సమానమే.

# బెదిరింపులు.. వినకపోతే అక్రమ కేసులు

● ఖాళీ బాండు పేపర్ల మీద సంతకాలు చేయించుకున్నారు

● పెద్దిరెడ్డి అనుచరుడి నుంచి వేధింపులు

● అవులపల్లె రిజర్వాయర్ భూనిర్వాసితుల ఆవేదన



మదనపల్లె సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆవులపల్లె రిజర్వాయర్ బాధిత రైతులు

మదనపల్లె టౌన్, జూలై 27: రిజర్వాయర్ కోసం మా భూములు ఇవ్వాలని పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు శశి బెదిరించాడు.. తాము వినకపోవడంతో పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడంతో పాటు ఖాళీ బాండు పేపర్ల మీద సంతకాలు చేయించుకున్నాడని రైతులు సబ్ కలెక్టర్ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుల భూదందాలపై బాధితులు మూడోరోజు శనివారం కూడా మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ వద్ద తమకు జరిగిన అన్యాయాలను ఏకరువుపెట్టారు. ముఖ్యంగా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం ఆవులపల్లె రిజర్వాయర్ నిర్మాణం కోసం పెద్దిరెడ్డి అనుచరులు బలవంతంగా రైతుల నుంచి 165 ఎకరాల భూమిని లాక్కోవడం, వాటిని వైసీపీ నాయకుల పేరిట రాయించుకోవడంపై బాధిత రైతులు వారి ఆవేదన వెళ్లగక్కారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు మోహన్‌నాయుడు మాట్లాడుతూ బంగారుపాళెంకు చెందిన 11 మంది రైతులు చాలా ఏళ్ల క్రితం సోమల మండలం ఆవులపల్లె వద్ద 165 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. మూడేళ్ల క్రితం అవులపల్లె రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని 165 ఎకరాల భూమిని తమ పేరిట రాసివ్వాలని పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు శశి తమను బెదిరించాడన్నారు. అందుకు తాము ఒప్పుకోకపోవడంతో యాదమరి మండలంలో ఉన్న మోహన్‌నాయుడు గ్రానైట్ క్వారీకి మైనింగ్ అధికారులను పంపి తప్పుడు కేసులుపెట్టి క్వారీని సీజ్ చేయించారన్నారు. అంతేకాకుండా ఫారెస్ట్ అధికారులను పంపి మోహన్‌నాయుడుపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారన్నారు. గత్యంతరం లేక తామందరం పెద్దిరెడ్డి అనుచరుడు శశికి 100 రూపాయల ఖాళీ స్టాంపు పేపర్ల మీద సంతకాలు చేసి ఇచ్చామన్నారు. తమకు నష్టపరిహారం ఇవ్వాలని అడిగితే ఆవులపల్లె రిజర్వాయర్‌ను ఎన్‌జీటీ నిలిపివేసిందని, మీకు పరిహారం కాదు కదా ఒక్క రూపాయి కూడా ఇవ్వమని శశి బెదిరించాడన్నారు. మూడేళ్ల పాటు మా గోడును ఎవరికి చెప్పాలో దిక్కుతోచలేదని, ఇప్పుడు మదనపల్లెకు వచ్చి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. దీనిపై విజయవాడకు వెళ్లి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు వీజీ చంద్రశేఖర్ ఆచారి, శ్రీనివాసులు, శ్రీకాంత్, జయంతి, ఆర్.గాయత్రి, సురేష్, వేణుగోపాల్, జగన్నాథం, జగదీష్ ఆచారి పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో వైసీపీ ముఖ్య నాయకులు

● మాజీ మంత్రి, ఎంపీ అనుచరులు పరార్

● పట్టణంలో చర్చనీయాంశంగా మారిన వైనం

మదనపల్లె టౌన్, జూలై 27: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసులో పోలీసులు మరో అడుగు ముందుకేశారు. ఈ కేసులో ప్రధాన అనుమానితుడు రైస్‌మిల్లు మాధవరెడ్డి పరారీలో ఉండగా ఆయనకు సన్నిహితంగా ఉంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిధున్‌రెడ్డి అనుచరుల్లో ఒకరిని శనివారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరో అనుచరుడు పోలీసుల విచారణకు స్వయంగా హాజరయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు..ఫైళ్ల దహనం కేసులో సీఐడీ పోలీసులు మాధవరెడ్డి బంధువులు, సన్నిహితులు, పనివాళ్లు, డ్రైవర్ల ఇళ్లలో సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసుల విచారణలో మదనపల్లె వైసీపీ ముఖ్యనాయకుల ప్రమేయం ఉందేమో అన్న కోణంలో శుక్రవారం అప్రమత్తం అయ్యారు. ఈ క్రమంలో స్థానిక పుంగనూరు రోడ్డులో నివాసం వున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి నివాసానికి శనివారం వేకువజామున 2 గంటలకు పోలీసులు వెళ్లి సోదాలు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో జింకా వెంకటాచలపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీంతో పాటు మండలంలోని తట్టివారిపల్లె బైపాస్ రోడ్డులో నివాసమున్న మిధున్‌రెడ్డి ముఖ్య అనుచరువు బాబ్‌జాన్ ఇంటి వద్దకు పోలీసులు వెళ్లారు. అక్కడ పోలీసులు పలుమార్లు తలుపు తట్టినా లోపలి నుంచి ఎటువంటి అలికిడి రాలేదని తెలిసింది. దీంతో ఉదయం 6 గంటలకు వరకు వేచి చూసిన పోలీసులు తిరిగి వచ్చేశారు. ఇదిలా ఉండగా మిధున్‌రెడ్డి మరో ముఖ్య అనుచరుడు, సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సర్పంచ్ భర్త, వైసీపీ నాయకుడు అక్కులప్ప స్వగ్రామమైన మిట్టపల్లెలోని ఆయన ఇంటికి వెళ్లి పోలీసులు సోదాలు నిర్వహించారు. అంతేకాకుండా అక్కులప్పను విచారణకు రావాల్సిందిగా పోలీసులు ఫోన్ చేయడంతో అక్కులప్ప స్వయంగా డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఈ కేసులో పోలీసుల విచారణకు తాను సహకరిస్తానని అక్కులప్ప చెప్పడం గమనార్హం.

### పరారీలో పెద్దిరెడ్డి అనుచరులు

మదనపల్లె పట్టణంలో శనివారం పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్యఅనుచరుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిధున్‌రెడ్డిలకు వీరవిధేయులుగా ఉన్న వైసీపీ నాయకుల గుండెల్లో దడ మొదలైంది. ఈ క్రమంలో వైసీపీ నాయకులు ఒకరికి, మరొకరు ఫోన్లు చేసుకుంటూ ఎలా చేసేదంటూ పరామర్శించుకున్నట్లు సమాచారం. కొంతమంది అయితే ఇళ్లలో కుటుంబీకులకు చెప్పి బయట ప్రాంతాలకు పరారైనట్లు తెలిసింది. కనీసం వారి మొబైల్ ఫోన్లను కూడా తీసుకెళ్లకుండా ప్రత్యామ్నాయ ఫోన్లను తీసుకెళ్లినట్లు సమాచారం. ఏది ఏమైనా ఈ రెండు రోజుల్లో రాత్రిళ్లు పోలీసులు ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారు..? ఎవరిని అదుపులోకి తీసుకుంటారో..? అన్నదే పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.



డీఎస్పీ కార్యాలయంలోకి విచారణ కోసం వెళుతున్న వైసీపీ నాయకుడు అక్కులప్ప

## నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

● డీఆర్వో గంగాధర్ గౌడ్

కడప(కలెక్టరేట్), జూలై 27: ఏపీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్ల ద్వారా నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయని, ఆగస్టు 2వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధరగౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో సంబంధిత అధికారులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రెండ సెషన్లలో జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8-30 గంటల నుంచి 9-30లోగా, మధ్యాహ్నం 1-30 నుంచి 2-30లోగా చేరుకోవాలన్నారు. లైజాన్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్‌వైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా జరిగేలా చూడాలన్నారు. పోలీసుశాఖ ప్రతి సెంటర్లో బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. మొత్తం 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కళాశాలల యాజమాన్యాలు అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులు డీఎస్ మల్లికార్జునరెడ్డి, సెక్షన్ ఆఫీసర్, మానిటర్ నాగభూషణంతో పాటు లైజాన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## కోదండరామాలయంలో హైకోర్టు న్యాయమూర్తి



ఒంటిమిట్ట, జూలై 27: ఒంటిమిట్ట కోదండరాముడిని హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకటశేషసాయి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మూలవిరాట్ అయిన సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. రంగమండపంలో అర్చకులు ఆలయ విశిష్టత, చరిత్రను తెలియజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రికార్డులకేదీ రక్షణ?

● శిథిలావస్థలో రికార్డుల రూము

● పాడుబడిన కిటికీలు, వాకిళ్లు

● ఫ్లెక్సీ బోర్డులు, రేకులతో కవరింగ్

● ఇదీ కడప తహశీల్దారు కార్యాలయం దుస్థితి



రెవెన్యూ రికార్డుల రూముకు ఫ్లెక్సీలతో కప్పిపెట్టిన దృశ్యం

కడప(కలెక్టరేట్), జూలై 27: కడప తహశీల్దారు కార్యాలయం అంటేనే 4.50 లక్షల జనాభాకు, దాదాపు 40 వేల ఎకరాల భూములకు జవాబుదారీ అని చెప్పొచ్చు. మనుషుల జనన మరణాల సమాచారం, బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు భూముల వ్యవహారాలకు సంబంధించిన రికార్డులను భద్రపరిచే గది శిథిలావస్థలో ఉంది. గదిలోకి గాలి, వాన రాకుండా రికార్డులను భద్రపరచడం రెవెన్యూ అధికారుల బాధ్యత. అయితే కడప తహశీల్దారు కార్యాలయం అందుకు భిన్నమనే చెప్పాలి. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ కార్యాలయాల మరమ్మతులకు రూ.6 లక్షల వరకు ప్రభుత్వం కేటాయిస్తే దాతల సహకారంతో అప్పటి తహశీల్దారు ఈ కార్యాలయాన్ని ఆధునికీకరించారు. అయితే తహశీల్దారు రూము, స్టాఫ్ రూము తప్పించి రికార్డులను భద్రపరిచే గది వైపు చూడలేదు. దీంతో కీలకమైన రెవెన్యూ రికార్డులన్నీ విరిగిపోయిన తలుపులు, ఊడిపోయిన కిటికీల మధ్య భద్రపరిచారు. కార్యాలయం వెనుక వైపున కిటికీలు, తలుపులను చేతులతో లాగితే వచ్చేసే విధంగా ఉన్నాయి. కిటికీలు, వాకిళ్లు పాడై పోవడంతో రెవెన్యూ అధికారులు పాత ప్రచార ఫ్లెక్సీలతో కప్పిపెట్టారు. అంతేకాకుండా రికార్డుల రూముకు వెనుక వైపు ఆరు అడుగుల ఎత్తున, రెండు అడుగుల వెడల్పుతో గోడ కూలిపోయింది. ఇక్కడ గోడ కట్టకుండా కేవలం రేకుతో బిగించారు. ఇంకా చెప్పాలంటే వెనుక వైపున నిలబడి కిటకీల వైపు చూస్తే రికార్డులన్నీ స్పష్టంగా కనిపిస్తాయి.

### మదనపల్లె ఘటనతో..

తాజాగా అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూలో కీలకమైన ఫైళ్లను కాల్చివేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. జగన్ పాలనలో రెవెన్యూ శాఖ చేసిన తప్పులు దొరకకూడదనే మదనపల్లెలో ఫైళ్లను దహనం చేశారని అంటున్నారు. కడప తహశీల్దారు కార్యాలయం పరిధిలో కూడా రికార్డులతో సంబంధం లేకుండానే ప్రభుత్వ భూములు, పేదల భూములు 4 వేల ఎకరాలకు పైగా అడ్డగోలు రిజిస్ట్రేషన్లు జరిగాయని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల విలువచేసే వంకలు, వాగులు, ప్రభుత్వ భూములను అధికార పార్టీ పెద్దలకు కట్టబెట్టడంలో రెవెన్యూ శాఖ అత్యుత్సాహం చూపింది. ఈ నేపథ్యంలో కడప తహశీల్దారు కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులను భద్రంగా చూసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ వాచ్‌మెన్‌తో పాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే అది కార్యాలయానికి ముందు వైపు మాత్రమే. రెవెన్యూ అధికారులు అప్రమత్తమై రికార్డుల గదిని పటిష్టంగా నిర్మించక పోతే ఎప్పుడైనా మదనపల్లి కథ కడపలో కూడా జరిగే అవకాశం ఉందని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కిటికీ నుంచి స్పష్టంగా కనిపిస్తున్న రికార్డులు



గోడ కూలడంతో రంధ్రాన్ని రేకుతో బిగించిన దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి


విగతజీవిగా పడి ఉన్న రెడ్డమ్మ (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

వల్లూరు, జూలై 27: మండల పరిధి పెద్దపుత్త గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డమ్మ (12)మృతి చెందినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. సమాచారం మేరకు వివరాల్లోకెళితే... పొద దుర్తి వాసులు సుబ్బరాయుడు, రుక్మిణమ్మ కుమార్తె రెడ్డమ్మ వెంకటాపురం గ్రామంలో ఉండి పెద్దపుత్త జడ్పీ హైస్కూల్‌లో 7వతరగతి చదువుతోంది. శనివారం పాఠశాల వదిలిన తరువాత సైకిలుపై ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ఢీకొనడం తో రెడ్డమ్మ అక్కడిక క్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ వెంకటరమణ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల కారణాలను తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. సంఘటలనా స్థలం వద్ద గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుమికూడారు.

## విద్యుత్తు షాక్‌తో యువకుడు....


నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

ఖాజీపేట, జూలై 27: ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురవడంతో నీలం వెంకటసువార్జన (20) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్లితే మేజర్ పంచాయతీ చెర్లోపల్లె వాసి వెంకటసువార్జన కుళాయి నీటికి మోటారు బిగించి నీటిని పట్టేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్తు షాక్‌కు గురయ్యారు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

● నివాళులర్పించిన టీడీపీ నేతలు

యువకుడు విద్యుత్తు షాక్‌కు గురైన విషయం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు గ్రామస్థులు తెలపడంతో మండల టీడీపీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి మృతదేహంపై పూలగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పిచ్చినాయుడు, సుబ్బరాయుడు, నాగేష్, రమణ, రాంప్రసాద్, చిన్న సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## విలీనంతో కోల్పోయిన సౌకర్యాలను భర్తీ చేయాలి

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య


సమావేశంలో మాట్లాడుతున్న నరసయ్య

కడప (మారుతీనగర్), జూలై 27: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో కార్మికులు, ఉద్యోగులు కోల్పోయిన సౌకర్యాలను భర్తీచేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరస య్య డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యాలయం లో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రత కోసం 2019లో టీడీపీ ప్రభుత్వం జారీచేసిన సర్క్యులర్ నెంబర్ 1-2019ను వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే పక్కన పెట్టిందన్నారు. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా ఆ సర్క్యులర్‌ను తిరిగి అమలు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం జయప్రదం కావాలంటే ఇప్పుడున్న కొద్దిపాటి బస్సులు సరిపో వన్నారు. విలీనం అనంతరం కారుణ్య నియామకాలు తప్ప ప్రత్యక్ష నియామకాలతో ఒక్క ఉద్యోగం కూడా భర్తీచేయలేదన్నారు. బస్సుల సంఖ్యను దశలవారీగా కుదించారని, ఆర్టీసీ బస్సుల స్థానంలో మరిన్ని అద్దె బస్సులను ప్రవేశ పెట్టారని ఆరోపించారు. జనవరి నుంచి చాలా మంది ఉద్యోగ విరమణ పొందుతున్నా ఆ ఖాళీలు భర్తీ చేయక పోవడంతో సంస్థ నష్టపోతోందన్నారు. తక్షణమే ఆ ఖాళీలను భర్తీచేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు పొదుపు చేసుకున్న ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్ట్ డబ్బు చెల్లించేలా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు వున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్‌ను ప్రస్తుతం రిటైర్డ్ అవుతున్న వారికి కూడా వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కె.కె. కుమార్, నాన్ ఆపరేషన్ కార్యదర్శి అంకిరెడ్డి, రంగనాథ్, జిల్లా కార్యదర్శి ఎ.ఆర్. మూర్తి, పలువురు యూనియన్, ఆరు డిపోల నేతలు పాల్గొన్నారు.

## పోతిరెడ్డి పాడు ద్వారా నీళ్లు విడుదల చేయాలి

జాయింట్ కలెక్టర్‌కు ఏపీ రైతు సంఘం నేతల వినతి


జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

కడప(కలెక్టరేట్) జూలై 27: శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్ ద్వారా నీళ్లు విడుదల చేసి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు శనివారం ఏపీ రైతు సంఘం నేతలు విన్నవించుకున్నారు. పోతిరెడ్డి పాడు సహా కేసీ కెనాల్, తెలుగు గంగకు నీరు విడుదలవడంతో రైతాంగానికి పంటల సాగుకు మేలు జరుగుతుందన్నారు. శ్రీశైలం జలాశయానికి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు చేరి డ్యామ్ నీటి మట్టం 870 అడుగులకు చేరుకుందన్నారు. వెంటనే పోతిరెడ్డి హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నీరు విడుదల చేస్తే గాలేరు నగరి కాల్వ ద్వారా గోరుకల్లు, అవుకు, గండికోట ప్రాజెక్టుకు, తెలుగు గంగ, వెలుగోడు ప్రాజెక్టులు నిండి తాగు, సాగు నీరు ఇబ్బందులు అధిగమించ వచ్చన్నారు. రాయియల సీమ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అరకొరగా పంటల సాగు ఎండుదశకు వచ్చాయని, శ్రీశైలం నుంచి నీటి విడుదల వల్ల సీమ జిల్లాల్లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులు జలకళను సంతరించు కుంటాయన్నారు కేసీ కెనాల్ నుంచి నీరు వస్తోందని రైతులు కెనాల్ ఆయకట్టు కింద, బోరుబోవుల కింద పంటలు పెట్టేందుకు నారుమళ్లతో సిద్ధమయ్యారన్నారు. తక్షణమే ప్రజా ప్రతినిధులు, అధికారులు నీటి సలహా మండలి సమావేశం జరిపి ప్రభుత్వంపై వత్తిడి పెంచి స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని జేసీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. జేసీని కలసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సీఐటీయూఐ జిల్లా అధ్యక్షుడు కె .శ్రీనివాసులరెడ్డి రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనరు శివారెడ్డి తదితరులు ఉన్నారు.

## "కేతు తలపులలో" సంచిక ఆవిష్కరణ నేడు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 27: "కేతు తలపులలో" స్మృతిసంచిక ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహిస్తున్నట్లు స్మృతి సంచిక సంపాదకులు పాలగిరి విశ్వప్రసాద్, నిర్వాహకులు కేతు శిరీష తెలిపారు. సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 9.30కి ఈ సభప్రారంభం అవుతుందన్నారు. తెలుగు సాహిత్య ప్రముఖులు అనేక మంది కేతు విశ్వనాథరెడ్డి గురించి, రాసిన వ్యాసాలతో పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తంగా సంచిక రూపొందిందని తెలిపారు. ప్రముఖ కథా రచయిత దాదాహయాత్ అధ్యక్షతన జరిగే ఈ అవిష్కరణ సభలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ స్మృతి సంచికను ఆవిష్కరిస్తారన్నారు. ప్రముఖ రచయితలు మధురాంతకం నరేంద్ర, కాట్రగడ్డ దయానంద్ ప్రధాన ప్రసంగం చేసే ఈ సభలో, గౌరవ అతిథులుగా అరసం రాష్ట్రకార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, ప్రముఖ కథారచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, విశ్రాంత చరిత్ర అధ్యాపకులు యమ్మనూరు ప్రభాకరరెడ్డి, సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం బాధ్యులు టి.రాంప్రసాదరెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరెడ్డి పాల్గొంటారని విశ్వప్రసాద్, కేతుశిరీషలు తెలిపారు.

# 1400 కుక్కలకు సంతతి నియంత్రణ

కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు ● రోజుకు పది కుక్కలకు పైగా ఆపరేషన్లు
యాంటి రేబిస్ వ్యాక్సిన్ సైతం ఇస్తున్న వైనం ● అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లో సంరక్షణ


కుక్కకు ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు, జూలై 26: ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా పెరిగిపోతోంది. ఇటీవల కుక్కల దాడులతో అనేక మంది పిల్లలు, పెద్దలు తీవ్రగాయాలపాలైన సందర్భాలూ ఉన్నాయి. వాహనదారులు ప్రమాదాలకు గురైన సమయాలు అనేకం. గతంలో కుక్కల సంతతి ఎక్కువైతే పట్టుకుని చంపేసే వారు. అయితే సమాజంలో ఏ జంతువు, వన్యప్రాణి ప్రాణం తీసే అధికారం ఎవరికీ లేదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా కుక్కల సంతతి పెరిగిపోయింది. దీంతో వాటిదాడులు మరీ ఎక్కువయ్యాయి. ఫలితంగా పలుసందర్భాల్లో పిల్లలు పెద్దల ప్రాణాలకే ప్రమాదం పొంచి వున్న పరిస్థితులు దాపురించాయి. తల్లిదండ్రులు ధైర్యంగా పిల్లలను రోడ్లమీదికి పంపలేని పరిస్థితి నెలకొంది. అయితే కుక్కల సంతతిని నియంత్రణ చేపట్టేందుకు ప్రభుత్వం కుక్కలను పట్టుకుని సంతతి నియంత్రణ కోసం శస్త్రచికిత్స చేయడం మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారులు రోజుకు పదికి పైగా కుక్కలకు సంతతి నియంత్రణ శస్త్రచికిత్స చేయడం ప్రారంభించారు.

### కుక్కల నియంత్రణకు చర్యలు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 5వేల నుంచి 7 వేల వరకు కుక్కల సంతతిని మున్సిపల్ ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. పొట్టిపాడు రోడ్డులోని కంపోస్ట్ యార్డులో గతేడాది నవంబరు 18న అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణంలో కుక్కలను ప్రత్యేక టీంతో పట్టించి వాటికి స్టెరిలైజేషన్ చేస్తున్నారు. ఆపరేషన్లు చేశాక వాటికి వారం రోజుల పాటు ఆహారం పెట్టి సంరక్షిస్తారు. వాటికి మందులు వాడి కుట్లు మానిపోయాక వాటిని మళ్ళీ పట్టణంలో వదులుతున్నారు.

### యాంటి రేబిస్ వ్యాక్సినేషన్

అనిమల్ బర్త్ సెంటర్‌లో కుక్కలకు అంటీ రేబిస్ వ్యాక్సినేషన్ ప్రక్రియ కూడా చేపడుతున్నారు.


కుక్కను పట్టుకుంటున్న సిబ్బంది

ఇందువల్ల కుక్క కరిచినా వెంటనే ర్యాబిస్ వ్యాధి సోకకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### 1400 కుక్కలకు స్టెరిలైజేషన్

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో రోజుకు పది కుక్కల వంతున పట్టి అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలిస్తారు. వాటికి రోజూ అక్కడ ఆహారం పెడతారు. ఉదయం రేబిస్ వ్యాక్సినేషన్ చేస్తారు. సాయంత్రం స్టెరిలైజేషన్ చేస్తున్నారు. ఈ సెంటర్‌లో ఇప్పటి వరకు 1400 వందల కుక్కలకు స్టెరిలైజేషన్ చేశారు. ఒక్కో కుక్కను పట్టినందుకు వాటికి యాంటి ర్యాబిస్ వ్యాక్సినేషన్ వేయడానికి స్టెరిలైజేషన్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు మొత్తం కలిపి రూ. 1347 మున్సిపాలిటీ చెల్లిస్తోంది. ఇప్పటి వరకు కుక్కల నియంత్రణకు మున్సిపాలిటీ రూ. 18,85,800 ఖర్చుచేసింది.

**కుక్కల నియంత్రణ నిరంతర ప్రక్రియ**

కుక్కల నియంత్రణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ప్రొద్దుటూరులో దాదాపు 5 వేలకు పైగా కుక్కలు వున్నట్లు సర్వేలో గుర్తించాము. అందులో 2023 నవంబరు నుంచి ఇప్పటి వరకు 1400 కుక్కలకు స్టెరిలైజేషన్ ఆంటీర్యాబిస్ వ్యాక్సినేషన్ చేపట్టాము. ఏ ప్రాంతంలో ఎక్కువ కుక్కలు వున్నాయో ఆ ప్రాంతానికి వెళ్లి వాటిని పట్టి మొదట ఆపరేషన్లు చేస్తున్నాము. ఇది నిరంతరం చేపట్టవలసిన ప్రక్రియ. దానిపై ప్రత్యేక శ్రద్దతో పనిచేస్తున్నాము. ప్రత్యేకంగా సిబ్బందిని సైతం ఏర్పాటు చేశాం

*రఘునాథరెడ్డి మున్సిపల్ కమిషనర్*

## రేపు 'సర్వరాయ సాగర్'లోని మత్స్య సంపద వేలం

కడప(రూరల్) జూలై 27: సర్వరాయసాగర్ రిజర్వాయరులో మత్స్య సంపద అమ్మేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. వీరపునాయునిపల్లె మండలం కొమ్మద్ది పరిధిలోని సర్వరాయ సాగర్ రిజర్వాయర్‌లో 2024 జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు చేపలు పట్టుకుని అమ్ముకునేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10-30 గంటల నుంచి 1-00 గంట వరకు కొమ్మద్ది సచివాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగి వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, నకలు, రూ. 10,000 రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ప్రభుత్వం 1434వ పసలీకు నిర్దేశించిన రిజర్వాయర్ గుత్త పైకము మొత్తం రూ. 2,93,113లు నుంచి వేలం మొదలవుతుందని తెలిపారు.

## కులంపేరుతో దూషించారని కేసు నమోదు

రామాపురం, జూలై27: కల్పనాయునిచెరువు పంచాయతీ గాలంగుండ్లపల్లె హరిజనవాడ వాసి కాసిపోగుల సోనియాను చరసాల దిలీప్ కులం పేరుతో దూషించాడని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోనియా అడపలమాలపల్లె చర్చిలో జరుగుతున్న ఉత్సవాలకు వెళ్లేందుకు 26వ తేదీ ఉదయాన్నే వ్యాన్‌లో అగ్రహారం హరిజనవాడకు వెళ్లి స్థానికులను చర్చికి తీసుకెళ్లేందుకు వ్యాన్‌లో ఎక్కించుకు వస్తుండగా గ్రామస్థుడు దిలీప్ వ్యాన్‌ని అడ్డగించారు. ఎక్కడికి తీసుకెళ్తున్నారని సోనియాను అడగ్గా చర్చికి తీసుకెళుతున్నారని చెప్పడంతో అందరినీ మత మార్పిడి చేస్తున్నట్లుగా ఆమెను దిలీప్ నిలదీశాడు. అనతరం ఆమెను కులం పేరుతో దూషించారని శనివారం రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## క్లారిఫైయర్‌లో పడి ఆర్టీపీపీ జేపీఏ మృతి



ఎర్రగుంట్ల జూలై27: ఆర్టీపీపీ డీఎం ప్లాంట్ జేపీఏ హుస్సేన్ బాష (45) శుక్రవారం రాత్రి క్లారిఫైయర్‌లో పడిమృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈయన స్టేజ్ వన్ డీఎం ప్లాంట్‌లో శాంపుల్ సేకరించి పరీక్షలు చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి శాంపుల్ తెచ్చేందుకు క్లారిఫైయర్ దగ్గరకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వైవీయూలో డిగ్రీప్రవేశాలకు వెబ్‌ఆప్షన్లు ప్రారంభం

కడప (ఎడ్యుకేషన్), జూలై 27: వైవీయూ డిగ్రీ కోర్సుల్లో రిజిస్ట్రేషన్ అయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుని ప్రవేశాలు పొందాలని వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. డిగ్రీ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీకాలేజీస్ వెబ్‌ఆప్షన్ మొదలైందన్నారు. 29 వరకు కొనసాగుతుందన్నారు. డీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్స్, హానర్స్ కోర్సులు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించామని తెలిపారు. బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్‌మేటిక్ అప్లైడ్ జియాలజీ బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి వైవీయూ కళాశాలలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అకడమిక్ పరిశోధనల పరంగా జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగి వైవీయూ నాణ్యమైన విద్యనందిస్తుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బెస్ట్ టీచర్స్ అవార్డులకు 5లోగా దరఖాస్తు చేసుకోండి

రాయచోటిటౌన్, జూలై27: రాష్ట్ర, జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, సాంఘిక సంక్షేమ, మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 2024 రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మూడు సెట్లు ఆగస్టు 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయంలో, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డీవైఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు పరిశీలించి ఆగస్టు 10వ తేదీలోగా డీఈఓ కార్యాలయానికి అందజేయాలని ఆయన సూచించారు. దరఖాస్తు దారులు బోధనలో కనీసం 15 ఏళ్ల అనుభవం ఉండాలని, రాష్ట్ర అవార్డుకు గతంలో జిల్లా స్థాయి అవార్డు పొంది ఉండాలన్నారు. ఉపాధ్యాయులపై ఎటువంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌శాఖా పర క్రమశిక్షణ చర్యలు ఉండరాదన్నారు. జాతీయ స్థాయి అవార్డుకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు రాష్ట్రా అవార్డులకు దరఖాస్తు చేయకూడదన్నారు. అన్నమయ్య జిల్లా పరిధి ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం రాష్ట్ర, జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు.

## వైవీయూలో పలు విభాగాల తనిఖీ


ఫైళ్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రారు

కడప (ఎడ్యుకేషన్), జూలై 27: వైవీయూలోని పలు విభాగాలను కులసచివులు ఆచార్య రఘునాథరెడ్డి శనివారం తనిఖీ చేశారు. పలు విభాగాల్లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విశ్వవిద్యాలయ అతిథిగృహాల వార్డెన్లతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో పబ్లిక్ రిలేషన్ సెల్‌తో సమీక్షించారు. పీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ ఎస్వీ సుబ్బారెడ్డి అవసరాలను రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు.

# ఇటు 'కేసీ' సాగదా

● నీటికోసం ఎదురుచూపులు
● భూములు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు



చాపాడు వద్ద చాపాడు చానెల్ - మైదుకూరు వద్ద కేసీ కెనాల్

చాపాడు, జూలై 27: ఈ ఖరీఫ్ సీజన్‌లో చాపాడు, దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట మండలాల భూములకు కేసీ కెనాల్ నీరు సాగదా అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మండలాల్లోని భూములకు ప్రధాన జలవనరు కేసీ కెనాల్. ఈఏడాది ఖరీఫ్ సాగుకు రైతాంగం కేసీ కెనాల్ సాగునీటికోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోంది.

వ్యవసాయానికి, పాడిపరిశ్రమకు గుండెకాయలాంటి కేసీ కెనాల్ నీటితోనే మైదుకూరు నియోజకవర్గం రైతులు జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి, పత్తి, వేరుశనగ, నువ్వులు వంటి రకాల పంటలు సాగు చేస్తారు. జూన్, జూలై నెలల్లో కాల్వలకు సాగునీరు రాగానే వరి నారుకయ్యలు వేస్తారు. కేసీ కెనాల్‌కు ఉపకాల్వలుగా చాపాడు చానెల్, ఏటూరు కాల్వలున్నాయి. ఏటా చాపాడు మండలంలో సుమారు 25 వేల ఎకరాల్లో, దువ్వూరులో 14 వేల ఎకరాలు, మైదుకూరులో 8 వేల ఎకరాలు, ఖాజీపేటలో 12 వేల ఎకరాలు వరి పంట సాగు చేస్తారు. జిల్లాల్లో చాపాడు మండలంలో 25 వేల ఎకరాల్లో వరిపైరు సాగు చేయడం విశేషం. లక్ష్మీపేట, కేతవరం, చాపాడు, భద్రిపల్లె, ఖాదర్‌పల్లె, అన్నవరం, చియ్యపాడు తదితర గ్రామాల పరిధిలో రైతులు దుక్కి దున్ని భూములను సిద్ధంగా ఉంచారు. కానీ ఈ ఏడాది ఇప్పటికీ కాల్వలకు సాగునీరు రాకపోవడంతో రైతులు నారుకయ్యలు వేయలేదు. గతేడాది కేసీ కెనాల్‌కు సాగునీరు రానందున ఆరుతడి పైర్లు జొన్న, కొర్ర, కంది, పెసర వంటి పంటలు సాగు చేసి అసంతృప్తితో ఉన్నారు. ఈ ఏడాది ఈ నాలుగు మండలాల్లో రైతులు సుమారు 63 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం 866 అడుగులకు పైగా ఉందని అధికారులు పేర్కొన్నారు. కానీ 850 అడుగులు నీరు ఉంటేకానీ కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో పుష్కలంగా నీళ్లు ఉన్నందున రైతులు ధైర్యంగా ఉన్నారు. ఈ ఏడాదైనా కాల్వలకు సాగునీరు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రైతులు వరి విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. వరిపైరుకు పచ్చిరొట్ట ఎరువుగా వేసేందుకు జనుము, జీలుగలు చాలా మంది పెంచుతున్నారు. వరి పైరు సాగు చేసేందుకు జూలై, ఆగస్టు నెలల్లో మంచి అదును. ఈ అదునులో సాగు చేస్తే పంట మంచి దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఈ అదును దాటితే దిగుబడి చాలా తగ్గే అవకాశాలున్నాయి. కేసీకెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కోరాలని రైతులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను కోరుతున్నారు.


దుక్కి దున్ని నారుమడికి సిద్ధం చేసిన భూములు

### నీటిని విడుదల చేయించాలి



శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగునీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేసేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కృషి చేయాలి. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులంతా పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. జూలై, ఆగస్టు నెలలు వరి పంట సాగుకు అదును. కేసీ సాగునీటితో రైతులు వరి పైరు సాగు చేస్తారు. సాగునీటికోసం రైతులంతా ఎదురుచూస్తున్నాం.

*వీరారెడ్డి, రైతు, రాజువారి పేట గ్రామం*

### కాలువలకు నీటిని విడుదల చేయాలి



కేసీకెనాల్‌కు, చాపాడు చానెల్‌కు ప్రభుత్వం సాగునీటిని వెంటనే విడుదల చేయాలి. ప్రస్తుతం మండలంలోని భూములన్నీ బీడు బారాయి. వేరుశనగ, వరి, నువ్వులు, పసుపు వంటి పంటలకు కేసీ నీరే ఆధారం. నారుకయ్యలు వేసేందుకు ఎన్‌డీఎల్ఆర్, జిలకర, 999 వరి విత్తనాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నందున విడుదల చేయాలి.

*దేవసహాయం, రైతు, కేతవరం గ్రామం*

## పన్ను భారాన్ని ఉపసంహరించుకోవాలి

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 27: రాష్ట్రవ్యాప్తంగా నగరపాలక సంస్థల్లో, మున్సిపాలిటీల్లో పెంచని పన్నులు కడప నగర పాలక సంస్థలో అధికారులు ఎడాపెడా పెంచుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా ధ్వజమెత్తారు. శనివారం స్థానిక హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ సర్కారు కాలంలో గత పాలక ప్రభుత్వాలకన్నా ఎన్నడూ లేని విధంగా ఇంటి పన్నులు పెంచి చెత్త పన్ను సైతం వసూలు చేసిందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్తపన్ను భారం ప్రజలపై పడకుండా రద్దు చేసినా కడప నగర పాలక సంస్థ అధికారులు ఇళ్ల పన్నులు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

## ‘217 జీఓ రద్దు హర్షణీయం’

చెన్నూరు, జూలై 27: మత్స్యకారుల జీవన అభివృద్ధికి ఆటంకంగా మారిన 217 జీఓను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమని బెస్తసాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె సుబ్బయ్య పేర్కొన్నారు. వైసీపీ పాలనలో మత్స్యకారుల పొట్టకొట్టేవిధంగా 217జీఓ తెచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు చెన్నూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 27 చెరువులను పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని మత్స్యకారులను ఇబ్బంది పెట్టారన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2017 జీఓ తెచ్చి మత్స్యకారులను ఇబ్బందిపెట్టారన్నారు. కార్యక్రమంలో మత్స్య సంఘం నేతలు ఎం. వెంకట క్రిష్ణయ్య సి.శ్రీనివాసులు, శ్రీపతి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్



కడప (ఎడ్యుకేషన్), జూలై 27: ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షునిగా శివశంకర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం కడప నగరం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సమావేశానికి మాజీ రాష్ట్ర నాయకులు చంద్ర, జిల్లా కార్యదర్శి వలరాజు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీ టు పీజీ విద్యారంగ సమస్యలపై హాస్టలు సమస్యలపై మాట్లాడారు. సంస్థ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

## వైవీయూలో డిగ్రీ ప్రవేశాలు పొందండి

● వెబ్‌ఆప్షన్లు ప్రారంభం

కడప (ఎడ్యుకేషన్), జూలై 27: వైవీయూ డిగ్రీ కోర్సుల్లో రిజిస్ట్రేషన్ అయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుని, ప్రవేశాలు పొందాలని వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. డిగ్రీ కోర్సుల ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీకాలేజీస్ వెబ్ ఆప్షన్ మొదలైందన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 29 వరకు కొనసాగుతుందన్నారు. డీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్స్‌హానర్స్‌కోర్సులు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించామని తెలిపారు. బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్‌మేటిక్ అప్లైడ్ జియాలజీ బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి వైవీయూ కళాశాలలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అకడమిక్ పరిశోధనల పరంగా జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన వైవీయు నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన సంస్థల్లో పనిచేసిన అనుభవం గల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లులతో బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గోవుకు వైద్యచికిత్స

వేంపల్లె, జూలై 27: వేంపల్లెలోని గోసంరక్షకులు, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కలిసి గోవుకు వైద్యచికిత్స చేయించారు. గర్భందాల్చిన గోవు అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మానవత సంస్థ ప్రతినిధులు, గోసంరక్షకులు చక్రపాణిరెడ్డి, పుల్లగూర గోవర్ధన్, దొంతు సుమన్, గండి మాజీ చైర్మన్ కావలి కృష్ణతేజ తదితరులు పశువైద్యాధికారి సాదిక్ బాష, రిటైర్డ్ వెటర్నరీ అధికారి రాజారామ్‌ను పిలిపించి వైద్య చికిత్స చేయించారు. గతంలో కూడా వీరు 70 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్న ఓ ఆవుకు చికిత్స చేయించి ప్రాణాలు కాపాడారు.

## మట్కా బీటరు అరెస్టు

కడప (క్రైం), జూలై 27: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో చెన్నూరు బస్టాండు సమీపంలో మట్కా రాస్తున్న రవీంద్రనగర్‌కు చెందిన షేక్ ఫైరోజ్‌ను శనివారం మధ్యాహ్నం సీఐ సి.భాస్కర్‌రెడ్డితన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. రూ.5150 నగదు, రెండు మట్కా స్లిప్‌లను, బాల్‌పెన్‌ను సీజ్ చేశారు.

## 31న పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి ఈనెల 31వ తేదీ స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు తెలిపారు. కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్, కోర్సులలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టుసైజు ఫొటో, రూ.5,050 ఫీజుతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం





సింహాద్రిపురం:ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రిన్సిపాల్.. కమలాపురం: మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

● కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ

సింహాద్రిపురం, జూలై 27: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో శనివారం అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడ తాయన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా నియమించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు శివశంకర్, త్రినాథ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

కమలాపురం రూరల్, జూలై 27: మొక్కలు పెంచుదాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్షియాబేగం పేర్కొన్నారు. శనివారం స్థానిక కోగటం రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన శిక్షా సప్తాహ్‌లో భాగంగా మొక్కలను విద్యార్థుల తల్లిదండ్రులతో నాటించారు. వృక్షాలను మనం రక్షిస్తే అవి మనలను రక్షిస్తాయన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ కడప జిల్లా జాయింట్ ట్రస్టీ కాల్వ చలపతి, విద్యావాహిని కో ఆర్డినేటర్లు సుదర్శన్, వీరనారాయణతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం: తులసిరెడ్డి



వేంపల్లెలో అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 27: మాజీ రాష్ట్రపతి, భారత క్షిపణి పితామహుడు, భారత రత్న స్వర్గీయ ఏపీజే అబ్దుల్‌కలాం జీవన విధానం అందరికీ ఆదర్శమని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కొనియాడారు. శనివారం వేంపల్లెలో అబ్దుల్ కలాం వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ స్వయం కృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు అసామాన్యుడు కాగలడని, పేపర్ బాయ్ శాస్త్రవేత్త కాగలడని కలాం నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వేమా నాగరాజు, వేమయ్య, రవి, వినయ్,వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), జూలై 27 : మాజీరాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని కడప మాజీ డిప్యూ టీ మేయర్ ఆరిఫుల్లా అన్నారు. శనివారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో అబ్దుల్‌కలాం వర్ధంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అబ్దుల్‌కలాం చేసిన సేవలను కొనియాడారు.

## బోధనా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూలై 27: బోధనానైపుణ్యాలను మెరుగుపరుచుకోవలని టీచ్ టూల్ కోఆర్డినేటరు విశ్వనాథరెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో బోధనా నైపున్యాలను మెరుగుపరిచేందుకు ప్రధానోపాధ్యాయులు స్కూలు అసిస్టెంటట్లు, ఎస్టీటీలు సీఈఎంటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో మనం నేర్చుకున్న వాటిని తరగతి గదిలో విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లు గాయత్రి, ఉమామహేశ్వరి, నాగమణికుమారి, మునీంద్రమ్మ, రాజేశ్వరిలు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే కోర్సు కో ఆర్డినేటరు విశ్వనాదరెడ్డి, జిల్లా అబ్జర్వర్ సాయిరాం రిసోర్స్‌పర్సన్‌లను ఘనంగా సత్కరించారు.

## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ముఖ్యమంత్రిని కలిసిన ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునయ్య

కడప (మారుతీనగర్), జూలై 27: పెన్షనర్ల వెతలు తీర్చేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు సుముఖత వ్యక్తం చేయడం సంతోషకరమని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. మునయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబును విజయవాడలోని ఆయన చాంబర్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెన్షనర్లకు 1వ తేదీనే పెన్షన్ అందేలా చేయడం అభినందనీయమన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ త్వరలో మంజూరు చేస్తామని కూడా ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం ఆనందదాయకమన్నారు.
ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ నాయకులు వి.జయచంద్రుడు, ఎం. శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## ట్రిపుల్ ఐటీల్లో ముగిసిన అడ్మిషన్ కౌన్సెలింగ్

● 3396 మందికి అడ్మిషన్లు
● మిగులు సీట్లు 744
● దరఖాస్తుకు 30 వరకు గడువు
● ఆగస్టు 19 నుంచి తరగతులు

వేంపల్లె, జూలై 27: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో అడ్మిషన్ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిందని కన్వీనర్ అమరేంద్రకుమార్ సంద్ర తెలిపారు. ఈనెల 22న ప్రారంభమై 27వ తేదీతో కౌన్సిలింగ్ ముగిసింది. 4140మంది విద్యార్థులకు నాలుగు ట్రిపుల్‌ఐటీల నుంచి కాల్‌లెటర్లు పంపగా 3396మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. 744సీట్లు మిగిలాయి. ఆగస్టు మొదటి వారంలో రెండవ విడత కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. రెండవ విడతలో సీట్ల కోసం ఇంకా ఎవరైన దరఖాస్తు చేసుకోదలిస్తే ఈనెల 30వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌జీయుకెటి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తుచేసుకోవచ్చు. దరఖాస్తుచేసుకొని మొదటి విడతలో ఎంపిక కాని విద్యార్థులు రెండో విడత దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని కన్వీనర్ తెలిపారు. కాగా మొదటి విడతలో అడ్మిషన్ పొందిన విద్యార్థులందరు ఆగస్టు 19, 20వ తేదీలలో ఎంపికైన క్యాంపస్‌లకు హాజరుకావాలని తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తరగతులు ప్రారంభం రోజే తప్పక హాజరు కావాలని అమరేంద్రకుమార్ సంద్ర పేర్కొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

బద్వేలు రూరల్, జూలై 27 : ప్రైవేటు టీచర్స్, లెక్చరర్ల విధుల నిర్వహణలో సమయపాలన పాటించని యాజమాన్యాలపై విద్యాశాఖాధికారులు చట్టపరంగా చర్యలు చేపట్టాలని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా వెంకటయ్య కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో విద్యాశాఖ నుంచి స్పష్టమైన జీవోలు ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యాసంస్థలు బేఖాతరు చేయడం జిల్లా విద్యా శాఖాధికారులు చూస్తూ కూడా చర్యలు చేపట్టక పోవడం శోచనీయమన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 వరకు క్లాసులు జరపడం, అనంతరం స్టడీ అవర్స్ పేరిట టీచర్లు, లెక్చరర్లను ఇబ్బందులు పెడుతున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి దివ్య ఔషధం రాజయోగ సాధన

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: శారీరక, మానసిక రుగ్మతలకు రాజయోగసాధన దివ్య ఔషధంగా పనిచేస్తుందని హుబ్లీకి చెందిన రాజయోగ శిక్షకుడు విజయ్ పేర్కొన్నారు. శనివారం విజయనగరం వీధిలోని ఓంశాంతి భవన్‌లో రాజయోగ సాధనతో సంతోషమయ జీవన విధానం అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి మనోవికాసానికి, మానవహితానికి రాజయోగ సాధన ఉపయోగపడుతుందన్నారు. నిత్యం సాధన చేయడం వలన కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలను అదుపు చేయవచ్చునని తెలిపారు. ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు శాంత, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

# దశరథ స్వామి ఆలయంలో రామకోటి





పూజలందుకుంటున్న దశరథ మహారాజు స్వామి... అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చక్రాయపేట, జూలై 27: మండలంలోని దేవరగుట్టపల్లె సమీపంలో శ్రీరామచంద్రుని తల్లిదండ్రులైన కౌసల్య సుమిత్ర, కైకేయి సమేత దశరథ మహారాజుస్వామి ఆలయంలో శనివారం భక్తులు రామకోటి రాసే కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. అన్నప్రసాదం దాత సానే సుబ్బరామయ్య, మాజీ సర్పంచ్ దేవరగుట్టపల్లె ఆలయ ధర్మకర్త సోము రామసుబ్బయ్య కలిసి ఈ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## బాలోత్సవం కృషి అభినందనీయం: కలెక్టర్



పోస్టరును విడుదల చేస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప (ఎడ్యుకేషన్), జూలై 27 : కడప బాలోత్సవం కృషి అభినందనీయమని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు.శనివారం కలెక్టరేట్ తన చాంబరులో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను పురస్కరించుకుని కడప బాలోత్సవంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలకు సంబంధించిన పోస్టరును ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుల జీవితాలు, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలపై చిత్రలేఖనం, వ్యాసరచన నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. బాలోత్సవ అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రాహుల్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు బాల యల్లారెడ్డి, సుందరయ్య, తులసి, అరుణ పాల్గొన్నారు.

## శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ కత్తి వెంకటరమణ

వల్లూరు, జూలై 27 : శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం వల్లూరు కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, వారు చెప్పినట్టు చదువుకోవాలని, మంచి నడవడికతో ముందుకు సాగాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయులతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల ద్వారా ఇక్కడ చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మోహన్‌రావు, సచివాలయ మహిళా పోలీసులు, కస్తూర్బాపాఠశాల ఉపాధ్యాయురాళ్లు, బాలికలు పాల్గొన్నారు.

## నీటినిల్వలు లేకుండా చూసుకోవాలి



అబేట్ పిచికారీ చేయిస్తున్న సిద్దయ్య

వేంపల్లె, జూలై 27: దోమలకు నివాసాలుగా ఉంటున్న పనికిరాని గుంతలను, వాడని బావులను పూడ్చి నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మలేరియా అధికారి సిద్దయ్య అన్నారు. శనివారం మండలంలోని అలవలపాడు గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నీటి నిల్వలలో అబేట్ పిచికారీ చేశారు. సిద్దయ్య మాట్లాడుతూ మరుగుదొడ్ల గాలి గొట్టాలకు మెష్ కట్టించడం, పెంట కుప్పలను చెత్తాచెదారాన్ని తరచూ తొలగిస్తూ పారిశుద్ధ్యం పాటించాలన్నారు. దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు.

## జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించండి: బీజేపీ



ఎస్పీకి పూలబొకే అందిస్తున్న సింగారెడ్డి, వంగళ

కడప (మారుతీనగర్), జూలై 27: జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజును శనివారం ఆయన చాంబర్‌లో కలిసి పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు. కడప జిల్లా మతసామరస్యానికి ప్రతీకగా ఖ్యాతిగాంచిందన్నారు. ఈ పరిస్థితి చేజారకుండా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పోలీసులు అనుసరించిన తీరు వల్ల ప్రజల్లో ఓ రకమైన భావన నెలకొందని, దాన్ని రూపుమాపాలన్నారు.

## జనసేన సభ్యత్వ నమోదు



జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న సాయికుమార్

చక్రాయపేట జూలై 27: పట్టణంలో నిర్వహించిన జనసేన సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని జనసేన నాయకుడు పోలిశెట్టి సాయికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని నాగులగుట్టపల్లెలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయికుమార్‌ప్రమాద బీమా ఐదు లక్షలతో పాటు, ఆరోగ్యరీత్యా రూ.50వేలు ఆర్థికసాయం అందుతుందన్నారు. అఖిల్, ప్రసాద్, వరమని, శివ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రగతిని అధికారులు గమనించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి

కడప (ఎన్టీఆర్ సర్కి ల్), జూలై 27 : ప్రతి వసతి గృహ సంక్షేమ అధికారి విద్యార్థుల ప్రగతిని గమనించాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న సహాయ సంక్షేమ అధికారులతో పాటు వసతిగృహ సంక్షేమ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంచాలకులు జూమ్ మీటింగ్ ద్వారా తెలిపిన సూచనలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల నిర్వహణ, పిల్లల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. వసతిగృహాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన పెరటి తోటల పెంపకం గురించి వివరించారు. వసతిగృహాల పరిమితిని బట్టి విద్యార్థులను చేర్చుకోవాలని, దానికనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలన్నారు.స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో వసతిగృహాల్లో విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. వసతిగృహ ఆవశ్యకత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు సమీప వసతి గృహాన్ని సందర్శించి వారి పిల్లలను వసతిగృహాల్లో చేర్పించాల్సిన కోరారు. ఈ సమావేశంలో వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారులు క్రిష్ణయ్య, నాగేంద్ర, రాజు, జ్యోతి పాల్గొన్నారు.



# మీసేవ కేంద్రాల్లో నిలిచిన ప్రభుత్వ సేవలు

● 20 రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ● సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, రైతులు ఇక్కట్లు ● ఎన్‌ఓసీలపై జాప్యం చేస్తున్న కంపెనీ నిర్వాహకులు

పులివెందుల టౌన్, జూలై 27: మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు 20రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆశించిన మేరకు సేవలు అందక పోతుండడంతో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. రైతులు బ్యాంకు రుణాల రెన్యువల్ కోసం కావాల్సిన 1బి, అడంగల్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటర్, ఇంజనీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లలో వివిధ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడి నుంచి వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్ వరకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఉన్న గడువు కాస్త పూర్తవుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్ను, నీటిపన్ను, చెల్లించలేని పరిస్థితి ఉండడంతో ప్రజలు అసౌ కర్యానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏపీఆన్‌లైన్ సెంటర్లు 238, అర్బన్ ఫ్రాంచైజీలు 50 మీసేవ కేంద్రాలున్నాయి. వీటికి ఏపీఆన్‌లైన్, రామ్‌ఇన్ఫో సర్వీసులు అందించే కంపెనీ వారు ఉన్నారు. అయితే ఈ రెండు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బకాయిలు పడినట్లు తెలిసింది. దీంతో మూడు వారాల కిందట ప్రభుత్వ మీసేవ కేంద్రాలకు ఏపీఆన్‌లైన్ కేంద్రాలకు సర్వీస్‌లను నిలిపివేసింది. ఆయా సంస్థలు జిల్లాలోని ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వానికి బకాయిలు ఏమీలేనట్లు ఎన్ఓసీలు తెచ్చుకుంటేనే సర్వీసులు పునరుద్ధరిస్తామని చెప్పింది. అయితే ఆయా సంస్థలు ఎన్ఓసీ తెచ్చుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఈ కారణంగా మీసేవ కేంద్రాల్లోని సేవలు నిలిచాయి. ఒక్కో కేంద్రంలో సగటున 350 సర్వీసులను ప్రజలు వినియోగించుకుంటారు. 1బి, అడంగల్, మ్యుటేషన్, అడంగల్ కరెక్షన్, నీటిపన్ను, విద్యుత్, ఆస్తి పన్ను, ఆర్టీఏ, రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ, బర్త్, డెత్ తదితరసేవల కోసం వీటికే ఎక్కువ వెళ్తుంటారు. అక్కడ సర్వీస్ చార్జీలు చెల్లించుకుని నిర్ణీత తేదీన సర్టిఫికెట్లను కేంద్రాల నిర్వాహకులు అం దిస్తుంటారు. కుల ధృవీకరణ, ఆదాయం వంటి సర్టిఫి కెట్లను విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలో విద్యాసంస్థలు కోరుతుంటాయి. దీంతో అంతా మీ సేవ కేంద్రాల వైపు చూస్తుంటారు. ఒక్కసారి కుల ధృవీకరణ పత్రం ఇచ్చిన తర్వాత మళ్లీ తాజాగా తీసుకురావాలని కోరవద్దని ప్ర భుత్వం ఆదేశించిన వివిధ శాఖలు వాటిని బేఖాతర్ చేస్తు న్నారు. ఎప్పటికప్పుడు తాజాగా కులధృవీకరణ పత్రం తీసుకురావాలని విద్యార్థులను ఆజ్ఞాపిస్తున్నారు.అయితే విద్యార్థులు అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు రెవెన్యూ అధికారులు మైగ్రేషన్ సర్టిఫికెట్ తీసుకురావాలని చెబుతున్నారు. ఆ సర్టిఫికెట్ తెచ్చుకోలేక దళారులకు డబ్బు సమర్పించుకున్న తర్వాత వారికి కులధృవీకరణ పత్రం అందుతుంది. కొందరు రెవెన్యూ సిబ్బందికి ముడుపులు చెల్లిస్తేనే సర్టిఫికెట్ ఇస్తుంటారని డిమాండ్ చేస్తున్నారు. రోజూ మీసేవ ద్వారా ప్రభుత్వానికి రూ.లక్షల ఆదాయం సమ కూరుతుంది. 20 రోజులుగా సర్వీసులు నిలిచిపోయాయని, తక్షణం పునరుద్ధరించాలని మీసేవ నిర్వాహకులు, ప్రజలు కోరుతున్నారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

చాపాడు, జూలై 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు కష్టపడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా రైతు సేవా సమితి అధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో శనివారం ఆయన మాట్లాడుతూ రైతులు రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలకు లాభం రాలేదని, వారు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవడం లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉద్యోగులు రైతులకోసం సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## ఉచిత మెడికల్ క్యాంపునకు స్పందన

బద్వేలు , జూలై 27: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని బంకపాళెంలో వైద్య సిబ్బంది సహకారంతో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఓ బాలిక జ్వరంతో ఉండడాన్ని గ్రహించి ఆమెకు పలు రకాల పరీక్షల అనంతరం కడప రిమ్స్‌కు పంపించడం జరిగిందన్నారు. అలాగే పలువురికి డెంగీ, చికెన్ గున్యా, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించారు. చిన్న వ్యాధులతో బాధపడుతున్నావారికి వైద్యం అందించారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి మనోరమ, సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో దోమల నివారణకు మందు స్ప్రేయింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: వసంతపేటలోని చౌడేశ్వరీ తొగటవీర క్షత్రియ కల్యాణ మంపడంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కర్ణాటకకు చెందిన వరల్డ్ హెల్త్ డెవలప్‌మెంట్ అండ్ హ్యూమన్‌రైట్స్ ఫోరం, తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సాదిక్‌బాష మాట్లాడుతూ ప్రాచీనమైన మర్మకళ, టిబెటియన్ బిందు చికిత్స ఆక్యుప్రెషర్, ఆక్యుపంక్చర్ వంటి 21 చికిత్స పద్ధతులలో హైదరాబాదు, బెంగళూరుకు చెందిన వైద్యులు నజీరుద్దీన్, అస్మా, సుబ్రమణ్యం ఆచారి, సుబాన్, ముసజ్జిక్ పాషా, కరీమున్ వైద్యసేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణ మండపం అధ్యక్షులు బండారు రఘురామయ్య, మనప్రజాసేవా సమితి అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, మనసేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సుదర్శనక్రియతో సంపూర్ణ ఆరోగ్యం

కలసపాడు, జూలై 27 : సుదర్శనక్రియతో సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని కలసపాడు కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ కమాల్ అన్నారు. మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, కలసపాడు బాలికల ఉన్నత పాఠశాల , ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల నుంచి జరిగిన యోగా శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రిన్సిపాల్ రెడ్డి జ్యోతి, కలసపాడు ప్రధానోపాధ్యాయుడు షేక్ కమాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, సంఘ సేవకులు బిందు పాలుగుళ్ల పురుషోత్తంరెడ్డి, మనోహర్‌రెడ్డి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి దివ్య ఔషధం రాజయోగ సాధన

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: శారీరక, మానసిక రుగ్మతలకు రాజయోగసాధన దివ్య ఔషధంగా పనిచేస్తుందని హుబ్లీకి చెందిన రాజయోగ శిక్షకుడు విజయ్ పేర్కొన్నారు. శనివారం విజయనగరం వీధిలోని ఓం శాంతి భవన్‌లో రాజయోగ సాధనతో సంతోషమయ జీవన విధానం అన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి మనోవికాసానికి, మానవహితానికి రాజయోగ సాధన ఉపయోగపడుతుందన్నారు. నిత్యం సాధన చేయడం వలన కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలను అదుపు చేయవచ్చునని తెలిపారు. ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు శాంత, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన



జమ్మలమడుగు, జూలై 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న ఐటీఐ కళాశాల వద్ద దేవగుడి బ్రాంచ్ కెనాల్ కాలువ పారిశుధ్య శుభ్రత పనులను కమిషనర్ ప్రమోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. ముందుగా ఆయన మున్సిపాలిటీ దగ్గరలో గొర్రెల సంత ఏర్పాటు చేసే వద్ద అలాగే ఎస్సీ కాలనీ ఈశ్వరయ్య వీధి, సమీప వీధుల్లో పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో జరుగుతున్న పనులను సందర్శించి సూచనలు ఇచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆస్పత్రిలో వివిధ పనుల నిమిత్తం అభివృద్ధికోసం సమావేశం ఏర్పాటు చేసి దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్టు తరుపున రూ.5 లక్షలు ప్రకటించారు. అందులో భాగంగా ఆస్పత్రిలో రోగులకు బెడ్‌షీట్లు, తదితర వస్తువులు అందించారు. అదే విధంగా ఆస్పత్రి ఆవరణలో ఎర్రమట్టి గ్రావెల్ తెప్పించి నీళ్లు ఆగకుండా ఎత్తు పెంచారు. వాటిని కమిషనర్ పరిశీలించడం జరిగింది.

# ప్లాస్టిక్ భూతంపై అధికారుల నిర్లక్ష్యం

● యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం ● వ్యర్థాల మధ్య పందుల స్వైరవిహారం ● దోమలే దోమలు

జమ్మలమడుగు, జూలై 27: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో ప్రధాన సమస్య డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం. అందులో పట్టణమంతా గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం పెరిగింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది అధికారుల నిర్లక్ష్యం వలన కొన్ని ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగంపైకానీ, వ్యర్థాల శుభ్రతలోకానీ నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అందులో భాగంగా జమ్మలమడుగు పట్టణంలో హోటళ్లు, చిన్న చిన్న హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంది. ప్రజలు పడవేసిన ప్లాస్టిక్ వ్యర్థాలలో పందులు చేరి స్వైర విహారం చేస్తున్నాయి. అక్కడి నుంచే దోమలే దోమలు. డ్రైనేజీ కాలువల్లో సాయంత్రం అయిదు గంటల నుంచే దోమలు విజృంభన అధికంగా ఉంది. మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలలో పగలే దోమలు ఉన్నాయి. ఇటీవల ఆస్పత్రులలో విషజ్వరాలకు సంబంధించిన కేసులు పెరుగుతున్నట్లుగా డాక్టర్లు తెలిపారు. శుభ్రత లేకపోవడం వలన ఎప్పటికప్పుడు వ్యర్థాలను దహనం చేయాలని పలువురు సూచనలు ఇస్తున్నారు. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు ఎక్కువగా వస్తున్నట్లు పారిశుధ్య సిబ్బంది చెబుతున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జమ్మలమడుగు పట్టణంలో ప్రధానడ్రైనేజీ కాలువలు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ప్రొద్దుటూరు రోడ్డులో డ్రైనేజీ కాలువ పక్కన కంపచెట్లను తొలగిస్తుండగా కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుని ఉన్నాయి. ఇలాంటి అపరిశుభ్రత వలన రోగాలు పెరిగే అవకాశం ఉందని దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నా శుభ్రత లేనప్పుడు ఫాగింగ్ చేసినా దోమలు మాత్రం తగ్గడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జమ్మలమడుగులోని డ్రైనేజీ వ్యవస్థతోపాటు శుభ్రత, ప్లాస్టిక్ వినియోగంపై అధికారులు దాడులు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాల మధ్య పందుల స్వైర విహారం



వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

## 31న పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి ఈనెల 31వ తేదీ స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు తెలిపారు. కంప్యూటర్స్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్, కోర్సుల లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టుసైజు ఫొటో, రూ.5,050 ఫీజుతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

## నేటి విద్యాసదస్సును జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, జూలై 27 : యూటీఎఫ్ కార్యాలయంలో ఈ నెల 28న ఆదివారం ఉదయం జరగబోయే రాష్ట్ర స్థాయి విద్యాసదస్సు జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య శనివారం ప్రకటనలో కోరారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయని ఇందులో భాగంగా వివిధ జిల్లాల్లో సమకాలీన అంశాలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమం లో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌రావు, శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లు క్రిష్ణయ్య, నాయబ్‌రసూల్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## సీపీఎం ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

జమ్మలమడుగు, జూలై 27: ఈనెల 28వ తేదీ ఆదివారం జరుగనున్న సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని స్థానిక సీపీఎం కార్యదర్శి గోపాల్‌దాస్ యేసుదాసు తెలిపారు. జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన సీపీఎం కమిటీ బద్వేలు పట్టణంలో జరుగనున్న సమావేశాలకు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి విజయ్ పాల్గొన్నారు.

# ప్రజలు ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు పనిచేయవు

భూ కబ్జాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి : సీపీఎం

బద్వేలు , జూలై 27: ప్రజలు ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు పనిచేయవని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. శనివారం సీపీఎం బద్వేలు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట పేదల సమస్యలపై 600 మంది పేదలతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 70 సంవత్సరాలుగా ప్రభుత్వాలు వస్తున్నాయి, పోతున్నాయని కానీ పేదల జీవితాలలో మార్పు రావడం లేదన్నారు. సమస్యల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యంపై పేదవర్గాల ప్రజలు ఐక్యంగా పోరాడాలన్నారు. ఎన్నికల ముందు భూ కబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెడతామని టీడీపీ వారు ప్రజలకు వాగ్దానాలు ఇచ్చారని , అలాగే జైళ్లకు పంపించి కఠినంగా శిక్షిస్తామన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు భూ కబ్జాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని అసెంబ్లీ సాక్షిగా బహిరంగ పరిచారన్నారు. సి.కొత్తపల్లి పొలం ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుసుకుని వనవాసం చేస్తున్నారని కనీసం వారికి మంచినీరు అందించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్, మండల రూరల్ కమిటీ కార్యదర్శి దాసరి వెంకటేష్, వెంకటరమణ, చాంద్‌బాష తదితరులు మాట్లాడుతూ కొత్తపల్లె రెవెన్యూ పొలంలోని పలు సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు వేశారని, అవి ఇప్పుడు కనపడడం లేవన్నారు. అలాగే అట్లూరు మండలంలోని నల్లాయపల్లె తదితర చోట్ల ప్రభుత్వ భూములను పలువురు ఆక్రమించుకుని దౌర్జన్యంగా అనుభవిస్తున్నారని ఇలా నియోజకవర్గంలోని అన్ని మండలాలలో వందల ఎకరాల భూమి కబ్జాకు గురైనప్పటికీ వాటిపై ఫిర్యాదుచేసినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు రూరల్ భూ పోరాట కమిటీ సభ్యులు రామ్మోహన్, చంద్ర, సునీత, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

## పెద్దదుద్యాల గ్రామస్థులకు ప్రజాసంఘాల మద్దతు

ముద్దనూరు జూలై27:మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద పెద్దదుద్యాల గ్రామ ప్రజలు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు శనివారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. వారికి ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. అందులో భాగంగా సీపీఐ నాయకుడు మనోహర్‌బాబు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హానికల్గించే ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి,ఏఐటీయూసీ అధ్యక్షురాలు తారాదేవిరైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న పెద్దదుద్యాల గ్రామస్థులు

## పిల్లలు బయటకు వెళ్లకుండా చూసుకోవాలి

ఖాజీపేట, జూలై 27: స్కూల్ సమయంలో పిల్లలు బయటకు వెళ్లకుండా చూసుకోవాలని డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఖాజీపేట బాలుర హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ చేయడంతోపాటు మధ్యాహ్న భోజనం తిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలని, ఇష్టానుసారంగా చేస్తే చర్యలు తప్పవన్నారు. పిల్లలు బయట తిరుగుతున్నట్లు వస్తున్నాయని మరోమారు ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే స్కూలు సమయాల్లో బయట పిల్లలు తిరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం తింటున్న డిప్యూటీ డీఈవో

## గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచి ప్రజలకు శుభ్రమైన మంచినీటిని అందించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, వాటర్‌ప్లాంట్లు, 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. రోజువారీగా పారిశుధ్య పనులు నిర్వహించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణలో వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ కార్యదర్శులు ఇంటి పన్ను, పీఆర్1 యాప్, ఓడీఎఫ్ +, ఇంటింటి సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజనల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి, ఎంపీడీవో కుళాయమ్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విస్తరణాధికారి రామాంజనేయరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ రాష్ట్ర కళావేదిక కన్వీనరుగా రామక్రిష్ణారెడ్డి

పోరుమామిళ్ల, జూలై 27 : ఎస్టీయూ రాష్ట్ర కళావేదిక కన్వీనరుగా పోరుమామిళ్ల మండలానికి చెందిన రామక్రిష్ణారెడ్డి నియమితులు య్యారనీ రీజనల్ కన్వీనరు క్రిష్ణారెడ్డి, ఆర్.రమణయ్య తెలిపారు. అలాగే రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనరుగా కాశినాయన మండలానికి చెందిన సుబ్రమణ్యంను ఎన్నుకున్నారన్నారు. వీరిని శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర సంఘం అనుబంధ సంఘాలను ప్రకటించిందన్నారు.

## పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

అట్లూరు, జూలై 27: అట్లూరు డెమోక్రటిక్ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు , కార్యదర్శులుగా వెంకటేశ్, అరుణ్‌కుమార్‌ను శనివారం బద్వేలు పీఆర్టీయూ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కార్యదర్శి రవిశంకర్,విద్యాధర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హ్యూమన్‌రైట్స్ మిషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: హ్యూమన్ రైట్స్ మిషన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పాణ్యం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లం ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా పాణ్యం అహ్మద్‌హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఎస్.సంజీవరాయుడు, ప్రధాన కార్యదర్శి రాచమల్లు బాలూయాదవ్, వెల్ఫేర్ సెక్రటరీ బాలాజీ, లీగల్‌సెక్రటరీగా పురుషోత్తం, మీడియా కార్యదర్శి చిన్నిక్రిష్ణ, ఖలీల్‌బాషాను ఎన్నుకున్నారు.

## ఐటీఐ అభ్యర్థులతో సీట్లు భర్తీ

జమ్మలమడుగు, జూలై 27: జమ్మలమడుగు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఐటీఐ కళాశాలలో సిబ్బంది దరఖాస్తులను పరిశీలించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకోసం దరఖాస్తులను ఆహ్వానించామని ఆయన తెలిపారు. మైలవరం, జమ్మలమడుగు ఐటీఐ కళాశాలలకు సంబంధించి జమ్మలమడుగులోని తమ కళాశాల ఆవరణంలో అభ్యర్థులకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పంటకాల్వలు పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, జూలై 27 : పోరుమామిళ్లలోని వెంకటేశ్వర హైస్కూలు వెనుకభాగంలో పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువు కు వెళ్లే పంట కాల్వలను కొందరు ప్లాట్ల వ్యాపారులు వాటిని పూడ్చివేశారని వారిపై కఠిన చర్యలు తీసుకుని పంట కాల్వలను పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ తెలిపారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో పాఠశాల వెనుక వైపున ఉన్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరుమామిళ్ల నుంచి రంగసముద్రం చెరవుకుపంట కాల్వ గతంలో ఉండేదని, నీరు పుష్కలంగా రంగసముద్రం చెరువులోకి చేరేవని, ఇప్పుడు చూస్తే ఆ పంట కాల్వ పూర్తిగా కనుమరుగు అయిందన్నారు. వెంటనే ఇరిగేషన్,తెలుగుగంగ, రెవెన్యూ అధికారులు పంటకాల్వలను పునరుద్ధరించాలన్నారు. మురగకుంటగా మారిన ప్రాంతాన్ని కాల్వగా మళ్లించాలన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు.

## మొక్కలు పెంచండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి

పోరుమామిళ్ల, జూలై 27 : మొక్కలు పెంచి పర్యావరణం పరిరక్షించాలని టేకూరుపేట జిల్లాపరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వెంకటర మణయ్య అన్నారు. శనివారం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుపాకుల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన టీడీపీ నాయకులు

కాశినాయన,జూలై 27: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారాలోకేశ్,టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును కాశినాయన మండల టీడీపీ నాయకులు నర్సాపురం సర్పంచ్ చిన్నఖాజావలి,బసిరెడ్డి రవీంద్రారెడ్డి, టీడీపీ మండల కోఆర్డినేటర్ హుస్సేన్‌పీరా శుక్రవారం వెలగపూడిలో మర్యాదపూర్వకంగా కలిసి వారికి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా మండ ల సమస్యలతోపాటు జ్యోతిక్షేత్ర సమస్యను వారికి వివరించి పరిష్కరించాలని కోరామన్నారు.



## ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

బద్వేలు రూరల్, జూలై 27 : ప్రైవేటు టీచర్స్, లెక్చరర్ల విధుల నిర్వహణలో సమయపాలన పాటించని యాజమాన్యాలపై విద్యాశాఖాధికారులు చట్టపరంగా చర్యలు చేపట్టాలని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా వెంకటయ్య కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో విద్యాశాఖ నుంచి స్పష్టమైన జీవోలు ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యాసంస్థలు బేఖాతరు చేయడం జిల్లా విద్యాశాఖాధికారులు చూస్తూ కూడా చర్యలు చేపట్టక పోవడం శోచనీయమన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 వరకు క్లాసులు జరపడం, అనంతరం స్టడీ అవర్స్ పేరిట టీచర్లు, లెక్చరర్లను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తత అవసరం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తత అవసరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రెండో వార్డు మున్సిపల్ హైస్కూలులో సీజనల్ వ్యాధులపట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ సాధు శ్రీనివాసులు , వైద్య అధికారి డాక్టర్ మౌనిక, పాఠశాల హెచ్‌ఎం గీత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శామ్యూల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాష, సీవో సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కత్తెరగండ్ల పంచాయతీ పరిధిలో అక్రమవెంచర్

●పెద్దఎత్తున నిర్మాణాలు ●ప్రభుత్వ ఖజానాకు గండి ●పట్టించుకోని అధికారులు

కాశినాయన,జూలై27: కత్తెరగండ్ల పంచాయతీపరిధిలోని రెడ్డికొట్టాల గ్రామసమీపంలో సర్వేనెంబర్ 2133, 2134,2135,2136 లలోని దాదాపు 11 ఎకరాల్లో అక్రమ వెంచర్లు వెలిశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ల్యాండ్ కన్వర్షన్ లేకుండా పంచాయతీ,కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల అనుమతులు తీసుకోకుండా ఎలా వెంచర్ వేసి అమ్మకాలు కొనుగోళ్లుచేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పెద్ద, పెద్ద పట్టణాల శివారుల్లో వెంచర్లు వేసినట్టుగా హంగామాలతో నిర్మాణాలు జరుగుతుంటే అధికారులకు తెలిసికూడా మిన్నకుండా ఉండటం పలు అనుమానాలకు తావిస్తుందంటున్నారు. పోరుమామిళ్ళ పట్టణానికి అత్యంత సమీపంలో ఉండటంతో హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయని తద్వారా పెద్దఎత్తున ఆదాయం పొందవచ్చుననే ఉద్దేశ్యంతో నిర్వాహకులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్లాట్ల క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు వినికిడి. దీంతో ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన సొమ్ముదక్కకుండా పక్కదారి పట్టిందంటున్నారు. ఇందులో సర్వేనెంబర్ 2134,2136 సంబంధించి డీకేటీ భూములు ఉన్నట్లు తెలిసింది. ఇలా అక్రమమార్గంలో వెంచర్లు వేయడం ఒక ఎత్తైతే నిర్వాహకులు చెప్పిందే తడువుగా ట్రాన్స్‌కో అధికారులు ఆగమేఘాలమీద అందులో ఉన్న 33కేవీ లైన్లను మార్చడం, ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేయడం,లైన్‌లు లాగడం లాంటి పనులు ఎలాచేశారో ఎవరికీ అంతుబట్టడంలేదు. ఒక సామాన్యరైతు అన్నీ సక్రమంగా ఉన్నా విద్యుత్ కనెక్షన్‌కు అప్లైచేసుకొంటే సవాలక్ష ప్రశ్నలువేసి సతాయిస్తారు. అలాంటి ట్రాన్స్‌కో అధికారులు అక్రమ లేఅవుట్‌కు ఎలా విద్యుత్ సౌకర్యం కల్పించారో ఉన్నతాధికారులే తేల్చాల్సిఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా వెలసిన ఈవెంచర్‌లో కొత్త ప్రభుత్వం వచ్చినప్పటికీ నిర్వాహకులు అనుమతులకు ప్రయత్నించకుండా యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తుంటే సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డురంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇలాంటి అక్రమ లేఅవుట్లపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయంపై ఈవోపీఆర్డీ రామక్రిష్ణారెడ్డిని వివరణకోరగా ఎలాంటి అనుమతులు లేకుండా రెడ్డికొట్టాల సమీపంలో వెంచర్ వేసినమాట వాస్తవమేనని ఇప్పటికే కడప అర్బన్ డెవలప్‌మెంట్ అనుమతులు లేకుండా వేసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలని పైఅధికారునుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. స్థానిక పంచాయతీ సెక్రటరీ హరిబాబు ద్వారా లేఅవుట్ల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామని, స్పందించకపోతే చట్టపరమైన చర్యలకు ముందుకు సాగుతామన్నారు.



రెడ్డికొట్టాల సమీపంలో అక్రమంగా వెలసిన వెంచర్